# ఆడపిల్లే!

కష్టాల్ని భరిస్తూనే కట్టుకున్నవాని కనుసన్నలలోనే కడతేరాలని సోకాల్డ్ పాతివ్రత్య భావన నుంచి క్రొత్త జీవితానికి ద్వారాలు తెరిచిన కథ.

గాఢాంధకారం.... ఆ చీకట్లో ఓ చేత్తో పాపని ఎత్తుకుని వగరుస్తూ పరిగెడ్తోంది రేణుక. 'అమ్మా!....అమ్మా' అంటూ చేతులు చాచి పిలుస్తోంది.... "అయ్యో, రేణూ, ఏం జరిగిందమ్మా....ఎందుకలా అరుస్తున్నావు...." కన్న పేగు.... పేగు తెంచుకుని వస్తున్న కేక!

సావిత్రికి ఒళ్ళంతా చెమట పట్టింది భయంతో. చటుక్కున మెలుకువ వచ్చింది. చుట్టూ చీకటి. ఒక్క క్షణం ఏం అర్థంకాలేదు. అది కల అని అర్థంచేసుకునే లోపలే 'అమ్మా....అమ్మా!' రేణు పిలుస్తూంది. తలుపు చప్పుడవుతూంది.... చుట్టూ ఇంత చీకటేమిటి! కరెంటు పోయిందా! 'అమ్మా'— కలకాదు నిజంగానే తలుపు కొడ్తూ పిలుస్తూంది. చటుక్కున లేచి 'ఎవరూ' అంది సావిత్రి తలుపు దగ్గర కెళ్ళి.

"నేనమ్మా, తలుపు తీయి." ఆ గొంతు రేణుదే. సావిత్రి చటుక్కున తలుపు తీసింది. "రేణూ. ఏమిటి తల్లీ ఇంత రాత్రి ఇలా వచ్చేవేమిటి. ఏమయిందమ్మా? ఆవిడ భయంతో వణికిపోతూ అంది.

"ఎంత సేపటినించి పిలుస్తున్నానమ్మా ....ఈ చీకటేమిటి, లైట్లులేవా. కాలింగ్ బెల్ నొక్కా. ఎవరూ పలకలేదు." పిల్లనెత్తుకుని ఇంట్లో అడుగు పెట్టింది.

ఇంట్లో మాటలకి, హడావిడికి మెలకువ వచ్చి చేతిలో బ్యాటరీ లైటుతో వచ్చారు ప్రసాదరావు గారుగా. "ఏమిటి ఏం అయింది?" రేణుకని చూసి తెల్లబోతూ—"రేణూ నీవా, ఇప్పుడు ఈ వేళప్పుడు...."

"రైలు మూడు గంటలాలస్యం అయింది నాన్నా, తొమ్మిదికి రావల్సింది."

ఆయన అప్రయత్నంగా బ్యాటరీ లైటుతో గోడమీద గడియారం చూశారు పన్నెండు.

"అది సరే ఇంత హఠాత్తుగా, ఒంటరిగా...." ఆయన ప్రశ్నలు పూర్తికాక మునుపే లైట్లు వెలిగాయి. వాడిపోయిన మొహంతో, వాచిన కళ్ళతో, కుడి కంటి

కింద కమిలిన నల్ల మచ్చతో.... కూతురి అవతారం చూడగానే కడుపులో దేవింది. కన్నవాళ్ళకి. రేణుక చెప్పకముందే సంగతి అర్థమైంది మళ్ళీ ఏదో గొడవయింది. ఉన్నపాటున అర్ధరాత్రి ఒంటరిగా ఇలా వచ్చిందంటే పెద్ద గొడవే అయి ఉంటుంది. సావిత్రి ఆందోళనగా ఏదో అడగబోతూంటే ఆయన కళ్ళతోనే వారించి, "పిల్లని తీసికెళ్ళి పడుకోబెట్టు .... ఏదన్నా తినడానికి ఉంటే పెట్టు దానికి. అర్ధరాత్రి అయింది····వెళ్ళమ్మా రేణూ.... రేపు మాట్లాడుదాం" అన్నారు ప్రసాదరావు.

* * *

ఎప్పుడూ చలాకీగా, తాజాగా, అప్పుడే విరిసిన పువ్వులా కలకలలా కూతురు కళాకాంతులు పెళ్ళితోనే పోయాయి అన్నది ఎనిమిది నెలలకే అర్థమయింది వాళ్ళకు. ఎత్తి ఎత్తి ఎంగిలాకు మీద అడుగేసినట్టు వెతికి వెతికి మంచి సంబంధం—ఇంజనీర్లు, ఉన్నవాళ్లు అని మురిసిపోయిన వాళ్ళ మురిపెం పట్టుమని ఏడాది నిలవలేదు. పెళ్ళయ్యాక ఎనిమిది నెలలకి పుట్టింటికి వచ్చిననాడే అర్థమయింది. మొహంలో కాంతి పోయి, నిస్తేజమైన కళ్ళతో, నవ్వే కరవయిన కూతురి అవతారం చూసి బెంబేలు ఎత్తిపోయారు తలిదండ్రులు. నెల తప్పింది. వేవిళ్ళ కాబోలనుకున్నారు. అడిగితే "ఏం లేదు. ఏం ఉంది" అని నిర్లిప్తంగా అంటున్న కూతురిని అనుమానంగా చూశారు. వేవిళ్ళయితే శరీరానికి అనారోగ్యమే కానీ, నెల తప్పిన ఆనందం. మొహంలో కళ కరవై నిస్తేజంగా ఉన్న కూతురు ఏదో బాధపడుతోంది అన్నది అర్థమైంది.

"ఏం తల్లీ అలా ఉన్నావు? రమేష్ కూడా వచ్చి ఉంటే బాగుండేది. పెళ్ళయ్యాక మొదటి పండగకన్నా రాలేదు పిల్చినా. ఇప్పుడన్నా నీతో వచ్చి నాల్గు రోజులుండి వెడితే బాగుండేది" అంది సావిత్రి కూతురేమన్నా బయట పడ్తుందేమోనని.

"ఏమిటో ఆయన, ఆయన పని తప్ప సరదాలు లేవమ్మా ఆయనకి."

"అదేమిటే పెళ్ళయి పట్టుమని ఆరునెలలకే సరదాలు లేకపోవడం ఏమిటే?"

హఠాత్తుగా రేణుక మొహం ఎర్రబడి కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. తల్లికి కనపడకూడదని మొహం తిప్పుకోబోయింది. సావిత్రి చూడనే చూసింది. "ఏమిటి, రేణూ ఏమయింది, చెప్పమ్మా అతనేమన్నా అన్నాడా? ఇద్దరూ మాట మాట అనుకున్నారా- వచ్చిందగ్గర నించి చూస్తున్నాను." ఆరాటంగా, ఆందోళనగా అడిగింది.

"అమ్మా" బావురుమంది రేణుక. ఇంక కడుపులో దాచుకోలేని దుఃఖం వెల్లువలా బయటికి వచ్చింది. "అమ్మా ఇంక నేనక్కడికి వెళ్ళనమ్మా, ఆ కాపురం ఇంక నేను చెయ్యలేనమ్మా! నేనింక అక్కడికి వెళ్ళనే వెళ్ళను. ఐ హేట్

హిమ్ — హీ ఈజ్ ఎ శాడిస్ట్. ఓ సరదా. సరసం తెలియని మృగం" ఏడుపు ఆవేశంగా మారింది.

"రేణూ!" సావిత్రి మొహం వివర్ణమయింది.

"అవునమ్మా చదువు చూశారు, ఉద్యోగం చూశారు, హోదా చూశారు. వంశం అన్నారు. అన్నీ చూశారు. వీటన్నింటినీ మించిన సహృదయత, సున్నితత్వం, లాలిత్యం అన్నవి కూడా మనిషిలో ఉండాలన్నది మనం ఎవరం చూడలేదమ్మా. రూపంచూసి మోసపోవడం అంటే ఏమిటో నాకర్థమయింది" ఆవేశంగా.... అంది రేణుక.

కూతురి వంక నిర్ఘాంతపోతూ చూడడం మినహా ఏం అనలేకపోయింది సావిత్రి.

"అమ్మా సరసత, సౌమ్యతలేని మనిషితో కాపురం అంటే ఏమిటో అనుభవించిన వాళ్ళకే అర్థం అవుతుందమ్మా లోకానికి నేను అదృష్టవంతురాలిలా కనిపించవచ్చు. కానీ, నాకేం లోటన్నది ఎవరికీ అర్థం కాదమ్మా." ఆమె గొంతు రుద్ధమయింది.

"రేణూ నీవు అన్నింటినీ మరీ ఏదో ఊహించుకుని బాధపడుతున్నావేమో. సంసారం అన్నాక, ఒక ఇంట్లో ఇద్దరు కొత్తవాళ్ళు కల్సి బతకాల్సి వచ్చినప్పుడు అభిప్రాయభేదాలు వస్తాయమ్మా సామరస్యంగా సర్దుకోవాలి. అందరు భార్యా భర్తలు మాట మాట అనుకుంటూనే ఉంటారు. మీ నాన్నా నేను దెబ్బలాడుకోమా-" సావిత్రి కూతురికి సర్దిచెప్పాలనుకుంది.

"అమ్మా నాకివన్నీ తెలియవంటావా. నేనేం చదువుకోని మొద్దునా. నాన్న, నీవు దెబ్బలాడుకుంటారు. కానీ, మీ మధ్య ప్రేమానురాగాలనే పునాది ఉందమ్మా. ఆ పునాది ఉన్నప్పుడు అప్పుడప్పుడు వీచే గాలులకి, తుఫానులకి ఆ ఇల్లు పడిపోదమ్మా- పునాదులు కదిలిపోవు. మీరు ముప్పై ఏళ్ళుగా సంసారం చేస్తున్నారు. ఏదో రోజు మాట మాట అనుకున్నా వెంటనే "సావిత్రీ" అంటూ నాన్న నీ వెనక పడతారు వెంటనే....అలాంటి అండర్‌స్టాండింగ్ మా మధ్య లేదమ్మా."

"అతను సరదాగా ఉండడా, కోపిష్టా, అర్థం చేసికోడా. ఏమిటసలు ప్రాబ్లమ్ అతనితో, అసలు సంగతి ఏమిటో చెప్పమ్మా."

రేణుక నిట్టూర్చింది. "ఏమిటి చెప్పడం? ఎన్నని చెప్పడం? చెప్పడానికి ఎంతో సిల్లీగా ఉంటాయి. కూరలో ఉప్పెక్కువైతే ఏదో కావాలని వేసినట్టు రుస

రుసలాడే మొగుడ్ని - అదీ పెళ్ళయిన నెల్లాళ్ళకే కొత్తపెళ్ళాన్ని కసిరే మొగుడ్ని ఏ ఆడది ప్రేమించగలదు! టిఫిను పెట్టి మంచినీళ్ళు మర్చిపోతే మొగుడంటే లెక్కలేకపోవడం అంటూ ఎగిరే భర్తని, బొత్తాం కుట్టడం మర్చిపోతే మొగుడి మాటంటే నిర్లక్ష్యం అంటూ ధుమధుమలాడే భర్తని ఓ కొత్త భార్య గౌరవించగలదా, అభిమానించగలదా? సినిమాకి వెడదాం అని కొత్త భార్య ముచ్చటగా అడిగితే, వెధవ సినిమాలు బోరు. నీవు వెళ్ళ కావలిస్తే పక్కింటావిడతో అనే మొగుడి మన స్తత్వాన్ని భార్య ఎలా అర్థం చేసికోవాలి? మంచి వెన్నెల బాగుంది-డాబా మీద పడుకుందామా అంటే, నాకు వళ్లు పట్టేస్తుంది అంటూ చిరాకుపడే భర్తని చూసి ఎన్నో ఆశలతో, కలలతో, కోరికలతో వచ్చిన ఆ నవవధువు మనసు ముక్కలవదా? ఓ మంచి చీర కట్టుకుంటే భర్త పొగడాలని, మంచి టిఫినో, కూరో చేస్తే భర్త మెచ్చుకోవాలని కొత్త భార్య ఆశించడం అత్యాశా? సెలవురోజన్నా భార్యతో ఏ గార్డెనుకో వెళ్ళి హోటల్లో భోంచేసి రావాలన్న చిన్న కోరికలని కూడా తీర్చని మొగుడిని ఏ భార్య ప్రేమిస్తుంది? భార్య పుట్టింరోజు కనీసం మొదటి సంవత్సరం అన్నా గుర్తు పెట్టుకోని భర్తని ఏమనుకోవాలి? సరదాగా జోక్ చేస్తే కుళ్ళిపోయి మొహం గంటుపెట్టుకునే సెన్సాఫ్ హ్యూమర్ లేని భర్త పట్ల అనురాగం కలగమంటే కలుగుతుందా! మాటలో సౌమ్యత, మనసులో అనురాగం, పలకరింపులో ఆప్యాయత కరవయిన ఆ కాపురంలో భార్య మనసు ఎలా స్పందిస్తుంది!

ప్రతి ఆడపిల్ల పెళ్ళి గురించి, భర్త గురించి ఎన్నో కలలు కంటుంది. అందులో కాస్త అందం, చదువు, అన్నీ ఉంటే తనంటే భర్త ఎంతో ప్రేమానురాగాలు కురిపిస్తాడని, మురిపిస్తాడని, అలరిస్తాడని, గుండెల్లో పొదువుకుంటాడని ఆశించడం అత్యాశకాదు! సినిమాలలో మాదిరి డ్యూయట్లు పాడుకోకపోయినా, ఏ సాయంకాలం చీకటి వేళో పెరట్లోనో, డాబామీదో కూర్చుని సన్నగా ట్రాన్సిస్టర్ వింటూ, నీలాకాశం కింద పిల్లగాలుల మధ్య ఒడిలో తలపెట్టుకు పడుకుంటే, ఆ చేతులు తన కురులు మృదువుగా సవరిస్తూంటే పులకరించాలనుకోదా ఏ అమ్మాయి అయినా. అలా సెలవురోజులు ఏ గార్డెనులోనో చేతులు కలుపుకుంటూ నడవాలన్న చిన్న కోరిక ఏ కొత్త భార్యకి ఉండదు? తను వంట చేస్తుండగా వచ్చీ రాని పనులు చేస్తూ తనని విసిగెత్తిస్తుంటే తను మురిపెంగా కసరడం లాంటి సరసాలు దాంపత్యంలో చోటు చేసుకోవాలని కోరుకోవడం దురాశా! ఉదయం నిద్ర లేవగానే ఒక్క అరక్షణం భార్యని దగ్గరకి లాక్కుని చిన్న ముద్దు పెడితే, "గుడ్ మార్నింగ్ డార్లింగ్" అంటే ఆ ముద్దు టానిక్‌లా పని చేసి రోజంతా ఏ భార్య అయినా ఆ భర్తకి గొడ్డుచాకిరీ చెయ్యదా!

భార్య ముందు తల దించి తల దువ్వించుకోవడం, స్నానం చేస్తూ తువ్వాలు మర్చిపోయిన వంకతో భార్యని స్నానాల గదిలోకి లాగి సరిగంగ స్నానాలు చెయ్యడం, అన్నం తింటూ తింటూ భార్య పళ్ళెంలోది లాక్కుని తినడం, ఆఫీసు నించి రాగానే కాఫీకప్పుతోపాటు భార్య చేయి పట్టి దగ్గరకి లాక్కుంటే రోజంతా నిరీక్షణకి అర్థం కనపడదా? ఇలాంటి చిన చిన్న సరదాలకి డబ్బు ఖర్చు లేదు. భార్య భర్తనించి కోరేది ప్రేమానురాగాలుకానీ, సెక్స్ కాదన్నది అర్థం కాదా. ప్రేమలేని చోట స్త్రీకి సెక్స్ నరకం అన్నది ఈ మగాళ్ళకి అర్థంకాదా. రాత్రి అరక్షణం పని. భర్తకి తృప్తినివ్వచ్చుగాని భార్యకి కాదన్నది ఈ మగాళ్ళు ఎందుకు గ్రహించరు? ఆమెకి కావల్సింది భర్త గుండెల మీద తలపెట్టి పడుకుంటే, ఆ చేతులు అనురాగంతో శరీరాన్ని వీణగా చేసి మీటుతూ ఉంటే పులకింత కావాలి అన్నది ఎప్పటికీ అర్థం చేసికోలేరా! పత్రికలలో సెక్స్ సందేహాలు చూస్తే నవ్వు వస్తుంది. ఆడదాన్ని ఇంప్రెస్ చెయ్యడానికి అదే మార్గం అనుకునేవాళ్ళ తెలివి తక్కువతనానికి నవ్వు వస్తుంది. వాళ్ళ శక్తి సామర్థ్యాలు, ప్రతాపాలు చూసి ఆడది ప్రేమించదని, స్త్రీకి అది సెకండరీ థింగ్ అన్న నిజం వాళ్ళు తెల్సుకునే ప్రయత్నం ఎందుకు చెయ్యరు? మగాడు నపుంసకుడు అయినా ప్రేమానురాగాలు చూపి గుండెల్లో దాచుకుంటే చాలనుకుంటుంది ఆడది!

ఓ చిన్న చిరునవ్వుతో, ఓ మధుర వచనంతో భార్యని బానిసని చేసుకోవచ్చని ఈ పిచ్చి మొగవాళ్ళు ఎప్పుడు అర్థం చేసుకుంటారు? సరసం తెలీని మొగుడి కటువైన మాట కత్తిలా గుండెల్ని కోసి బాధపెడ్తుంది స్త్రీని. ఇవన్నీ ఎవరికి చెప్పడం? ఎలా చెప్పడం?"

ఎత్తి ఎత్తి ఎంగిలాకు మీద అడుగేసినట్టు వెతికి వెతికి మంచి సంబంధం—ఇంజనీరు, ఉన్నవాళ్ళు అన్న మురిపం ఏడాది నిలవలేదు. ఎనిమిది నెలలకి పుట్టింటికి వచ్చిననాడే అర్థమయింది.

"రేణూ, ఏం జరిగిందో చెప్పకపోతే మాకెలా తెలుస్తుంది? మీ నాన్నగారిని వెళ్ళి మాట్లాడమనాలన్నా అసలు సంగతి తెలియాలి కదా—చెప్పు రేణూ. అతను నీమీద చెయ్యి కూడా చేసుకుంటున్నాడా!" ఆందోళనగా అడిగింది.

"అమ్మా ప్రేమ ఉంటే చెంపదెబ్బ వేసినా ఆడది సహిస్తుంది. కోపం వచ్చినప్పుడు ఓ దెబ్బవేసి తర్వాత దగ్గరికి లాక్కునే భర్తని ఎప్పుడూ క్షమిస్తుంది. అన్నింటికన్నా ఆడదాన్ని బాధించేది ఇండిఫరెంట్ ఆటిట్యూడ్. భార్య అన్నదాన్ని ఇగ్నోర్ చేసి, ఆవిడ కా ఇంట్లో వండిపెట్టి, పిల్లలని కనే స్థానం మాత్రమే అనే యాటిట్యూడ్ ఏఆడదీ భరించలేదమ్మా. ప్రతి ఇంట్లో భార్యా భర్తా అర్చుకుంటారు. కానీ, తరువాత మర్చిపోవాలి. ఓ చిన్న విషయాన్ని పట్టుకుని రోజులకొద్దీ సాగదీసి,

సాధించి, ముంగిలా మాట్లాడకుండా కూర్చునే మనస్తత్వం నాకు సరిపడదమ్మా. ఊఁ అంటే, ఆఁ అంటే కోపం. మొగుడితో కూడా డ్రాయింగు రూములో గెస్టులా మాట్లాడాలి. తక్కెడలో మాటలు తూచినట్టు అటు ఇటు ఓ మాట ఎక్కువ అవ కూడదంటే ఎలా అమ్మా? ఏదీ సర్దుకునే మనస్తత్వం కాదు. ఇవతలివాళ్ళు చెప్పేవి, చేసేవి తప్పులు. ఆయన చేసేవి రైటు. తను ఇతరులను ఎన్నైనా అనవచ్చు. తనని ఎవరూ ఏమనకూడదు. మేమూ చదువుకుంటున్నాం. మాకూ ఓ వ్యక్తిత్వం ఉంటుంది. మాకూ కొన్ని అభిప్రాయాలు, టేస్టులు ఉంటాయి. ప్రతి దానికీ భార్యే సర్దుకోవాలంటూ ఎన్నాళ్ళమ్మా? అందరూ నీతులు చెపుతారు. పెళ్ళి కోసం, సంసారం కోసం, లోకం కోసం తల దించి ఎన్నాళ్ళు భరించాలి? భర్త సహృదయుడైతే ఎంత చదువుకున్న ఆడదైనా తనని తాను అర్పించుకొని ఏమన్నా భరిస్తుంది. ప్రేమలేని చోట పెళ్ళికి కట్టుబడి, ఈ మగాళ్ళ జులుం సహిస్తూ ఎన్నాళ్ళయినా పడుండాలంటావా!" రేణులో ఆవేశం కట్టలు తెంచుకుంది. ఆర్నెల్లుగా మనసులో అణగదొక్కిన ఆవేశం లావాలా పెల్లుబికింది.

"రేణూ, నీవు చెప్పిందంతా నిజమే. సామరస్యంలేని కాపురం స్త్రీకి నరకమే. కానీ, ఈ దేశంలో ఓసారి పెళ్ళయ్యాక ఆడదాని అదృష్టం మంచిదయితే అనుకూలుడైన భర్త దొరుకుతాడు. లేదంటే దురదృష్టం అని సరిపెట్టుకు బతకాల్సిందే."

"అదంతా ఇదివరకటి రోజుల మాటలు. ఏం పెళ్ళి, సంసారం, ఇల్లు, పిల్లలు, భార్య మొగుడికి అక్కరలేదా? మగాడికి ఆడదాని అవసరం లేకపోతే ఆడదీ ఈనాడు మగాడి అవసరం లేకుండా తన కాళ్ళమీద తను నిలబడగలదు." పౌరుషంగా అంది రేణుక.

రేణు మాటలతో ఆర్నెల్లకే కూతురి మనసు ఎంత విరిగిపోయిందో అర్థం చేసికోగలిగింది సావిత్రి. కానీ. పెళ్ళయ్యాక, అందులో నెల తప్పిన పిల్ల కాపురం వదులుకోవడం అంత సులువా! పెళ్ళయిన ఆర్నెల్లకే ఆ కాపురం వద్దన్న ఆడపిల్ల మనసు ఎంత గాయపడి ఉండాలి! ఇద్దరబ్బాయిల తరువాత ఒకతే కూతురని గారాబంగా పెంచి, పెద్ద చేసి ఇంజనీరని, బాగున్నాడని ఎంచి పెళ్ళిచేస్తే ఇలా జరిగిందేమిటి? సావిత్రి మనసులో వ్యథ బయటపడితే, కూతురు ఇంకా అధైర్యపడుతుందని అప్పటికి ఏం మాట్లాడలేదు.

ఆ రాత్రి భర్తతో అంతా చెప్పింది సావిత్రి. ప్రసాదరావు చకితులై విన్నారు. "అయ్యో, ఇదేమిటి, నిజంగానా? రమేష్ అలాంటివాడా? "రేణు అంత బాధ పడ్తోందా?" ఆయనకా క్షణంలో నిస్సహాయత తప్ప ఏం చెయ్యాలన్నది తట్టలేదు.

"ఏం చేద్దాం? మనం చెపితే వింటాడా! అసలు మనిషి నేచర్‌ని మనం ఎలా మార్చగలం? ఏదో అప్పు మాటకారి కాదనుకున్నానుగాని ఇలా...." ఆయన తల పట్టుకున్నారు.

"పోనీ వియ్యంకులతో మాట్లాడితే...." ఆరాటంగా అన్నారు ప్రసాదరావు.

"ప్రత్యేకం ఏముందని చెపుదాం, మీ అబ్బాయి సరసుడు కాదని ఎలా చెపుతాం? చెప్పినా వాళ్ళు మాత్రం ఏం చెయ్యగలరు? భార్యాభర్తల అన్యోన్యత అన్నది వాళ్ళిద్దరి మధ్య విషయం అంటే...."సావిత్రి సందేహంగా అంది.

"అదీ నిజమే. కొడుకుని వాళ్ళు ఏమన్నా అలా ఉండమన్నారా - వాడి స్వభావం అంతే అంటే మనం ఏమంటాం? ఏదో కొడ్తున్నాడు, హింసిస్తున్నాడంటే కంప్లైంట్ చేస్తాంగాని, ఇలా వాళ్ళమధ్య ప్రేమలేదని ఏం చెస్తాం? ఇంతకీ రేణు ఏమంటుంది?"

"వెళ్ళనంటూ ఏడుస్తూంది. నన్నక్కడికి వెళ్ళమనద్దు అని ఏడుస్తూంది. దానికి ఆరు నెలలకే మనసు విరిగిపోయిందండి."

"ఖర్మ. దాని ఖర్మ. ఎంచి ఎంచి అపురూపంగా పెళ్ళి చేస్తే ఇలా జరగడం....దానికి తోడు నెల తప్పిందంటున్నావు....ఈ పరిస్థితిలో మనం ఏం చెయ్యాలి?"

"అదే నేనూ అన్నాను. కాపురం, మొగుడు వద్దనుకోవడం అంత సులువు కాదు. అందులో పిల్ల పుట్టబోతుంటే మరీ ఇబ్బంది అని నచ్చచెప్పాను."

"అతన్ని శాంత సౌమ్యంగా మార్చుకోడానికి ప్రయత్నించమని నచ్చచెపుదాం. పెళ్ళి, సంసారం అన్నాక రకరకాల ప్రాబ్లమ్స్ ఉంటాయి. మరీ సెన్సిటివ్‌గా వర్రీ అయిపోతే ఎలా? సాల్వ్ చేసుకోడానికి ప్రయత్నించాలిగాని. ఊఁ. అఁ అంటే విడిపోతే తరువాత ప్రాబ్లమ్స్ ఆలోచించాలిగదా....దాంతో మాట్లాడుతాను రేపు." నిట్టూర్చి అన్నారు ప్రసాదరావు.

తరువాత వారం రోజులు తల్లి, తండ్రి రకరకాలుగా కూతురికి నచ్చచెప్పి' సంసారం వదులుకుంటే ఎదుర్కోవాల్సిన ఇబ్బందులు, పిల్లతల్లి కాబోతున్న తరుణంలో భర్తని వదిలితే వచ్చే ప్రాబ్లమ్స్ రకరకాలుగా చెప్పి, కూతుర్ని సామరస్యంగా అతన్ని మార్చుకోడానికి ప్రయత్నించమని ఓ విధంగా బలవంతంగానే పంపించారు. ప్రతి తల్లితండ్రుల మాదిరిగానే ఆలోచించి.

* * *

కూతుర్ని ఏదో నెలలో సారె ఇచ్చి పుట్టింటికి తీసుకువచ్చేనాటికి రేణుక కాపురం బాగుపడడం అటుంచి, పరిస్థితులు మరింత దిగజారాయి. కడుపుతో ఉన్న పిల్ల కళాకాంతులూ లేకుండా చిక్కి శల్యమై బతుకు భారంగా ఈడుస్తున్న దానిలా ఉన్న రేణు అవతారంచూసి సావిత్రి తల్లడిల్లి పోయింది. కాపురం పేరుతో కూతుర్ని కాటికి పంపామా అన్న ఆవేదన కలిగింది. ఏం అడిగినా రేణు అదోలా నవ్వి, "ఎందుకు అమ్మా అడుగుతావు? మీకు చెప్పుకుని ఏం లాభం? కష్టమో సుఖమో నేనక్కడే పడుండాలనిగదా అన్నారు" అంది.

సావిత్రి మనసు విలవిల్లాడింది. "రేణూ, మా ఉద్దేశం అది గాదమ్మా.... కాపురం...."

"అర్థం అయిందమ్మా, పెళ్ళయ్యాక ఆ కాపురం నరకం అయినా చచ్చేవరకు అక్కడే పడుండాలి అనేగదా మన పెళ్ళిళ్ళతో అర్థం...." పట్టుకున్న గొంతుతో అంది.

సావిత్రి విచలితురాలైంది. ఈ పరిస్థితిలో ఏం అనాలో అర్థంగాలేదు రేణుక ఏమాత్రం సుఖంగా లేదన్నది అర్థం అయినా, తాను ఏమని భరోసా ఇవ్వాలో, ఈ పరిస్థితి ఎలా చక్కదిద్దాలో, దిద్దగలిగే అవకాశం తమకి ఉందా.... లక్షప్రశ్నలు ఆమెని చుట్టుముట్టాయి.

"అమ్మా. ఆయన్ని సౌమ్యంగా మార్చుకోవాలన్నారు. భార్యాభర్తల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఉండకూడదు, మనసువిప్పి మాట్లాడమన్నావు—మంచయినా చెడయినా, నచ్చనిదైనా నెమ్మదిగా చెప్పి అర్థం అయేట్టు చూడమన్నావు. కానీ మీరు చెప్పినవి ఏ మాత్రం పనిచెయ్యలేదు గాబట్టి ఈ 'సూత్రబంధం' నించి ఇప్పటి కయినా నేను తప్పుకోవచ్చా?" జవాబు చెప్పమన్నట్టు చూసింది.

"నీవు చెప్పినా అతను....అతను వినలేదా?"

"చెప్పానమ్మా, ఆయనకర్థం అవాలని మనసు విప్పి చెప్పాను. అఫ్టరాల్ భార్య తనకు జవాబు చెప్పేది. భార్య తన లోటుపాట్లు ఎత్తిచూపేది అన్న పౌరుషం వచ్చేసింది. దాంతో నోరేకాక చెయ్యి చేసుకోడం మొదలు పెట్టారు."

"కడుపుతో ఉన్న ఇల్లాలిని కొట్టడమా, అంతకి దిగజారాడా? ఏదో చిన్న తనం—తెలియచెపితే సర్దుకుని కాపురం బాగుచేసుకుంటారని...." సావిత్రికి కోపంతో మాటలు తడబడ్డాయి. "ఉండు రానీ, నిలేసి అడుగుతాను."

"ఇంక నువ్వు, ఆయన అరుచుకోవడం ప్లీజ్, నీవు ఆయనతో మాట్లాడకు. నిన్ను కూడా ఏదో అని అవమానించితే సహించలేను. ముందీ నరకంలోంచి ఈ

పురిటి వంకనైనా నాలుగైదు నెలలు నన్ను బయటపడనీ. ఆ తర్వాత సంగతి ఆలోచిద్దాం. ఇప్పుడేదన్నా అంటే ఆకోపంలోపురిటికి పంపననవచ్చు ఆ మూర్ఖుడు." భర్త తత్త్వం తెలిసిన రేణుక తల్లిని వారించింది.

కోడలికి సారె పెట్టించడానికి వచ్చిన వియ్యపురాలితో మాత్రం చూచాయగా కొడుకు సంగతి చెప్పింది సావిత్రి. ఆవిడ ఆశ్చర్యంగా కోడలివంక చూసింది. "రేణూ నీవన్నా ఎప్పుడూ మా దగ్గిర ఏం అనలేదు." 'ఏం చెప్పను' అన్నట్లు చూసి తలదించుకుంది రేణు.

"వదినగారూ, ఏదోమాట మాట అనుకోవడం ప్రతి సంసారంలో ఉంటాయి. కానీ పెళ్ళయిన కొత్తలోనే ఇలా ఉంటే, ఎడమొహం పెడమోహంతో నూరేళ్ళ కాపురం ఎలా సాగుతుంది? ఈ కాలం అమ్మాయిలా చదువుకుంటున్నారు. వాళ్ళకి ఆత్మాభిమానం ఉంటుంది గదా. చీటికి మాటికి భర్త అంటుంటే, ఇంట్లో నీదేం లేదు, నాదే అంటే మన కాలంలో మాదిరి ఈ అమ్మాయిలూరుకుంటారా? కాస్తఅబ్బాయితో మాట్లాడండి మీరు. వాళ్ళ సుఖం, ఆనందంకంటే మనకేం కావాలి" అంటూ మెత్తగా చెప్పింది సావిత్రి.

"చిన్నప్పటినించి వాడు కాస్త ముభావి, కోపిష్టి— ఎంతసేపూ వాడన్నదే జరగాలి అన్న పంతం ఉండేది. ఎప్పుడూ చదువు తప్ప ఎవరితోనూ కలిసేవాడు కాదు. చదువులో ఎప్పుడూ ఫస్ట్ కనక మిగతావి మేమూ పట్టించుకోలేదు. పెళ్ళి, సంసారం అయితే వాడే సరదాలు నేర్చుకుంటాడు అనుకున్నాంగాని ఇలా.... రేణూ మాకు ఓ ముక్క చెప్పద్దా...." ఆవిడ నొచ్చుకుంటూ అంది.

"వదినగారూ మేం వెళ్ళాక కాస్త మాట్లాడండి— రేణు భయపడుతూంది. సంసారంలో సంతోషం కరవయితే అతనికి మాత్రం సుఖమా?" వియ్యపురాలు తల పంకించింది.

* * *

అమ్మాయినెత్తుకుని మూడో నెలలో వెళ్ళేసరికి భర్త మారకపోతాడా అన్న చిన్న ఆశ కాస్తా అడియాస అయింది. పైగా, తన గురించి అందరికీ చెప్పిందనే కసి ఇంకాస్త పెంచుకున్నాడు. ఆర్నెల్లు దూరంగా ఉన్నా తల్లి మంచిగా చెప్పినా మారని భర్తని చూసి హతాశురాలైంది. "ఏం అక్కడే ఉండకపోయావా? నేనంత చెడ్డవాడి నని ఊరంతా చాటినదానివి. మళ్ళీ ఏం మొహం పెట్టుకు వచ్చావు" అని దెప్పి పొడిచాడు.

తనేకాక, తన పిల్ల కూడా కన్నవారి మీద కొన్నాళ్ళయినా ఆధారపడాలన్న నిజం వెనక్కి లాగింది. తనో ఉద్యోగం చూసుకోవాలి. ఒంటరిగా పిల్లని పెంచు

కోవాలి అన్న స్థితికి ఆలోచన రేణుని వెనక్కి లాగకపోతే....ఛా....తనైనా కాస్త జాగ్రత్తపడి పిల్లని కనకుండా ఉండాల్సింది.

రోజూ దేనికో గొడవ. ఆర్గ్యుమెంట్లు, అరుచుకోడాలు, దెప్పిపొడవడాలు, కేకలు, క్రుతిమించిన రోజుచెయ్యి చేసుకోడం, మనశ్శాంతి కరవై, ద్వేషాలు పెరిగి, దూరాలు పెరిగి ఈ బతుకుకంటే బయటికి వెళ్ళి ఏ అవస్థలన్నా ఎదుర్కోవచ్చు నన్న నిర్ణయానికి వచ్చింది రేణుక.

ఏ బతుకయినా ఇంతకంటే అధ్వాన్నంగా ఉండదన్న నిబ్బరం కలిగింది. ఆ నిర్ణయం, నిశ్చయం పెద్దవాళ్ళకు తెల్పి అమలుపరచాలనుకునేలోగా— ఉన్న పాటున చేతిలో దమ్మిడీ లేకుండా పసిపిల్లతో సాయంత్రం ఇంట్లోంచి తరమబడ్తుం దని ఊహించలేదు. ఆ రోజు ఇద్దరి మధ్య తగవు పరాకాష్ఠకి చేరుకుంది జుట్టు పట్టుకు ఈడ్చి కళ్ళ ముందు మెరుపులు మెరిసేటట్లుకొట్టిన రమేష్‌ని ఎదుర్కొంది. వంటింట్లోంచి కత్తి చేత్తో పట్టుకుని అడుగు ముందుకు వేస్తే చస్తావు అని బెదరించింది. దాంతో ఆ పురుషపుంగవుడు ఉగ్రరూపుడై పులిలా గర్జించి, పులిలా దూకి, కత్తి విసిరేసి ఆ చేత్తో రేణుకని బయటికి ఈడ్చి తలుపేశాడు. ఏడుస్తున్న పిల్లని గుమ్మంలో పడేసి, తలుపు మూసుకున్నాడు. కాసేపు ఏం చెయ్యాలో దిక్కుతోచని స్థితిలో నిలబడి, తనకు కాస్త తెల్సిన ఎదురింటావిడ దగ్గర డబ్బు అప్పుచేసి రైలెక్కింది.

*　　　*　　　*

"ఏమిటీ దారుణం? ఉన్నపాటున ఇలా ఇంట్లోంచి వెళ్ళగొడతాడా?" కోపంతో వణికిపోయరు ప్రసాదరావుగారు, మర్నాడు రేణుక చెప్పింది విని.

"పోలీసులకి రిపోర్టు ఇస్తాను. పెళ్ళాన్ని వీధిలోకి నెట్టేయడం అంత సుళువనుకుంటున్నాడా? పెళ్ళంటే, భార్యంటే ఏమనుకుంటున్నాడు వాడు? వాడి అంతు తేలుస్తాను." ప్రసాదరావు ఆవేశంలో హుంకరించారు.

"నాన్నా.... ఆ కాపురం నాకింక వద్దు. అతన్ని ఏం చేసినా, ఏం అన్నా మారే మనిషి కాదు. అలాంటి కాపురం చచ్చినా చెయ్యనింక. డాడీ, దయచేసి నన్నక్కడికి వెళ్ళమనకండి. ప్లీజ్-నేనేదో ఉద్యోగం చూసుకునే వరకు కొన్నాళ్ళు నాకాశ్రయం ఇవ్వండి....ప్లీజ్, నేను నిలదొక్కుకునే వరకు ఆదుకోండి....పెళ్ళయిన దానిని, "ఆడపిల్ల"వి గాని ఇంక "ఈడపిల్ల"వి గాదు అనకండి....ఒక్క ఏడాది.... నాకేదో దారి దొరికే వరకు." దీనంగా కన్నీళ్ళతో చేతులు జోడించి అంది రేణుక.

"రేణూ!" దెబ్బతిన్న పక్షిలా అరిచారు ప్రసాదరావుగారు. "రేణూ! ఏమిటమ్మా ఈ మాటలు. నిన్నేదో ఇంట్లోంచి పొమ్మన్నట్టు మాట్లాడుతున్నావు. నీ తల్లీ, తండ్రీ ఇంకా బతికే ఉన్నారు. ఆయన రుద్ధకంఠంతో అన్నారు.

సావిత్రి కళ్ళు తుడుచుకుంది. "రేణూ, ప్రతి తల్లి, తండ్రి పిల్ల బరువని పెళ్ళి చేసి పంపరమ్మా. కూతురు సుఖపడాలని, తనకో ఇల్లు, సంసారం, భర్త పిల్లలు అండ ఉండి సుఖించాలని చేస్తారు. అంతమాత్రాన ఆడపిల్ల కష్టంలో ఉంటే ఆదుకోరనా అలా మాట్లాడుతున్నావు....?"

"రేణూ....పిల్లని కన్నాకయినా కన్న మనసు అర్థం కాలేదా....?"

"డాడీ, నిజమే పెళ్ళి చేశారు. సుఖపడాలనే కానీ, ఆ పెళ్ళి పెటాకులూ అయి రక్షించాల్సినవాడే నరకం సృష్టిస్తుంటే, "ఆడపిల్లకి ఇంకా "ఆదే" స్థానం అనడం న్యాయమా? "ఆడపిల్ల" పుట్టిందగ్గరనించి ఎప్పటికయినా "ఆడదే" అన్నట్టు, ఆడపిల్లకి పెళ్ళి చేసి పంపడం ఒక్కటే ధ్యేయం అన్నట్టు ఎందుకనుకుంటారు? ఏం, ఆడపిల్లనీ మగపిల్లాడితో సమంగా చదివిస్తున్నారు. సమంగా ఉద్యోగాలు చేస్తున్నారు. మగపిల్లవాడి గురించి లేని తొందర, ఆరాటం, ఆందోళన ఎందుకు? ఎంత తొందరగా పెళ్ళి చేసి బాధ్యత వదుల్చుకుందామనుకుంటుంటారు?"

ప్రసాదరావుగారు నవ్వారు. "అమ్మా! నీవూ ఒక ఆడపిల్లని కన్నావు కదా. అది పెద్దదవుతూంటే అప్పుడు నీకర్థం అవుతుంది. తల్లితండ్రుల ఆరాటం. నరే పోనీ, మా తరంలో లేని ధైర్యం మీ తరం చూపుతుందని ఆశిస్తాను రేణూ. ఏ తరం అయినా, ఎప్పటికయినా సృష్టిలో ఆడదాని స్థానం మారదమ్మా శారీరకంగా బలహీనురాలైన స్త్రీకి ప్రతి దశలోనూ పురుషుని అండదండలుంటాయి."

"రబ్బిష్ డాడీ. ఆపండి. చదువుకున్న మీరూ అలా మాట్లాడకండి. ఆడపిల్ల బలహీనురాలెందుకు అయింది? పుట్టిందగ్గరనించి, అసలు పుట్టక ముందునించి ఆడపిల్ల పుడుతుందని భయం. వీలయితే పుట్టకుండా చెయ్యడం, పుడితే ఆడపిల్లా అని బాధపడడం- ఆడపిల్లను ఏదో కాస్త చదివించి తొందరగా పెళ్ళిచేసి బాధ్యత వదుల్చుకుందామన్న ఆరాటం - ఆడపిల్లలకి, మగపిల్లలకి ఇంట్లో ఎంత తేడా చూపుతారు. అది చెయ్యకు, అలా నవ్వకు, అలా గెంతకు, అలా చెట్లెక్కకు, ఆడపిల్లవుగాదూ- ఆ నవ్వేమిటి? మగపిల్లాడితో సమంగా ఆ గెంతులు ఏమిటి? వద్దిక నేర్చుకో, అత్తవారింటికి వెళ్ళాల్సిన దానివి. రేపు పొద్దుట మొగుడితో కాపురం ఎలా చేస్తావు? మగరాయుడిలా ఆ బట్టలేమిటి? ప్రతి క్షణం అమ్మాయిలకి ఆడపిల్ల, ఆడపిల్ల అని గుర్తుచేస్తూ అన్నింటిలోనూ మగాడికంటే తను తక్కువ అన్న

న్యూనతాభావం బీజం నాటుతారు. ఆడపిల్ల పెళ్ళి చేశాక, ఇంక నీ స్థానం అక్కడే. ఈ ఇంట్లో నీకు స్థానం లేదు. మంచయినా, చెడయినా, చావయినా, బతుకైనా అక్కడే అంటూ చేతులు దులుపుకుంటారు. పాపం అమ్మాయి ఏం చేస్తుంది? చిన్నప్పటినించి విని విని, నరాల్లో జీర్ణించుకుని తను ఏం చేసినా మగవాడితో సమంగా అవలేదని, పెళ్ళియ్యాక భర్త ఏం చేసినా ఆ ఇల్లు వదిలితే అధోగతని, పుట్టింటివారు ఆదుకోరని, వంటరి బతుకు కంటే ఏ మొగుడో ఓ మొగుడు అంటూ సర్దుకు బతకడానికి మెంటల్‌గా ప్రిపేరు చేస్తారు." రేణుక ఆవేశం కట్టలుతెంచుకుంది.

"రేణూ!" సావిత్రి అడ్డబోయింది.

"ఉండమ్మా నన్ను చెప్పనీ- ఏ తల్లీ, తండ్రయినా కూతురికి తామున్నా భరోసా ఇస్తే నరకం లాంటి కాపురం నించి బయటపడడానికి సాహసిస్తుంది. అమ్మ కావాలని ఏ ఆడపిల్లా సంసారం వదులుకోదమ్మా. సహనం ఆఖరిమెట్టుకు వచ్చాక, ఆడది గడప దాటుతుంది. అలా గడప దాటిన ఆడపిల్లకి కన్నవాళ్ళు చెయ్యి అందించి కొన్నాళ్ళయినా ఆశ్రయం ఇస్తే ఈ దేశంలో ఇన్ని ఆడపిల్లల చావులుండవు. అలా తల్లి, తండ్రి ఆశ్రయం ఇస్తారు అంటే ఆ మొగుడు భయపడతాడు. ఎవరాదుకుంటారు దీన్ని? నేనే గతి, చచ్చి నట్టుపడి ఉంటుంది. అనుకునే గదా మొగుళ్ళ విర్రవీగుతున్నారు. ఆమె ఇల్లు వదిలిపోతుందేమోనన్న భయం ఉన్ననాడు ప్రతి భర్తా భార్యని హింసించే ముందు కొంత సంకోచిస్తాడు ఓ ఆడపిల్ల కాపురం వదిలితే లోకంలో అన్ని దారులూ మూసుకుపోతాయని. ఎందుకనుకుంటారు? అమ్మాయిలూ చదువుతున్నారు. నాల్గురోజులుఆదుకుంటే ఏ ఉద్యోగమో చేసుకుంటారు. పెళ్ళయ్యాక అమ్మాయి అంత బరువైపోతుందా? ఊరికే కూచుని ఆమె తింటుందా? తనూ ఏదో చేసినాలుగురాళ్ళు సంపాదిస్తుంది. కొంత నీ వెనక మేం ఉన్నామన్న నిబ్బరం ఇస్తేచాలమ్మా. ఏం, పెళ్ళి- సంసారం ఆడదానికేనా, మగాడికక్కరలేదా? మగాడు లేకపోయినా డబ్బుంటే ఆడది నిక్షేపంగా బతుకుతుంది. అదే ఆడది లేని సంసారం మగాడు చెయ్యలేడు. పిల్ల తల్లితండ్రులు ఊరుకోరు, నిలేస్తారు అన్న భయం ఉన్న నాడు మగాడు ఇంత తెగించడు."

"రేణూ, ఈ మాటలన్నీ వినడానికి, వాదించడానికి బాగుంటాయి. ప్రాక్టికల్‌గా ఉండే ఇబ్బందులు అనుభవంలోకి వచ్చాకే అర్థమవుతాయి. మగాడికేం నాల్గురోజులు పోతే మరో పెళ్ళి చేసుకుంటాడు. కానీ, పిల్లతల్లివి నిన్నెవరు చేసుకుంటారు. నూరేళ్ళ జీవితం వంటరిగా...."

"ఏం పెళ్ళికాకపోతే చచ్చిపోతానా, బతకలేనా? అవును ఆడపిల్లని వదుల్చుకుంటే చాలని మగాడి కోసం ఎగబడి కట్టబెట్టే ఆడపిల్లల తల్లితండ్రులుంటే

ఎందుకు చేసుకోడు మగాడు. ఓ పిల్లని ఇచ్చే ముందు మొదటి ఇల్లాలు ఆ ఇంట్లోంచి ఎందుకు వెళ్ళింది అని అరక్షణం అయినా ఆలోచించరు. చూస్తా. నేనూ చూస్తా. మరో పెళ్ళి ఎలా చేసుకుంటాడో నేనూ చూస్తా. "ఫలానా వాడి సంగతి ఇది. పిల్లనిచ్చే ముందు జాగ్రత్త అంటూ పేపర్లో వేసి వీడి బండారం బయటపెడ్తా." ఎర్రబడ్డ మొహంతో, అదురుతున్న పెదాలతో అంది."

"నీ ఆవేశం అర్థం అవుతుందమ్మా కానీ...."

"కానీ లేదు, అర్థం కాలేదు. మీరెన్ని చెప్పినా నేనింక అక్కడికి వెళ్ళను. నా ఆశలు, కోరికలు సమూలంగా నరికేసిన అలాంటి మొగుడు నాకక్కరలేదు. నన్ను మీరు ఆదుకోలేమంటే నా దారి నేను చూసుకుంటా. అక్కడ చేసే పని ఇంకో ఇంట్లో చేస్తే ఇంత తిండి దొరక్కపోదు. పదిమంది పిల్లలకి ట్యూషను చెప్పుకుంటాను. ఏం లేకపోతే చస్తాను...." స్థిరనిశ్చయంగా అంది రేణుక. సావిత్రి భర్త వంక చూసింది. ఆయన నిట్టూర్చి, "రేణూ మేం ఉన్నన్ని రోజులు నీకంత కర్మ పట్టదు- కానీ తర్వాత."

"ఏం ఈలోగా ఏదో ఉద్యోగమే దొరకదా? నా కాళ్ళ మీద నేను ఈలోగా నిలబడలేనా?"

"అమ్మా రేణూ, ఒకవేళ అతను పిల్లనివ్వనని కోర్టుకెక్కితే!" సావిత్రి సందేహం.

"హుఁ-ఆడదాని ఈ బలహీనత మీదే గదా మగాళ్ళు ఆటలాడుతున్నారు. మహారాజులా తీసికెళ్ళి పెంచుకోమంటాను. ముందు ఆడవాళ్ళు ఈ విషయంలో గుండె దిటవుపరుచుకోవాలి....నీకేం పిచ్చా అమ్మా. ఈ పసిపిల్లని తీసికెళ్ళి ఆయనెందుకు పెంచుతాడు. ఊరికే బెదిరిస్తాడు. గట్టిగా ఉండి సరే అంటే అప్పుడే బండారం బయటపడ్తుంది." రేణు నిబ్బరంగా అంది.

"రేణూ, భగవంతుడు నీకింత అన్యాయం చేసినందుకు కనీసం మగపిల్లాడిన్నా ఇస్తే బాగుండేది. రేపొద్దున పిల్ల పెళ్ళి....ఈ సమస్యలు అన్నీ ఎలా నెగ్గుతావు?"

"హుఁ....డాడీ ఇంత చెప్పినా మళ్ళీ అదే మాట. అసలు "ఆడపిల్ల" అన్న మాట మన డిక్షనరీ లోంచి తీసేయాలి. "అమ్మాయి" అనండి, "కూతురు" అనండి. "ఆడపిల్ల." "ఆడది" అంటూ పుట్టిందగ్గరనించి పరాయిగా చూసే ఆ పదం నా నిఘంటువులో ఉండదు. ఈ రోజు నుంచి నా కూతురిని ఎవరూ "ఆడపిల్ల" అంటే ఒప్పుకోను. అమ్మాయి అంటే "ఈడపిల్లే" అనేట్టు పెంచుతాను నా కూతురిని." పంతంగా, పౌరుషంగా అంది.

"మంచిదే తల్లీ, మీ బతుకులు మార్చి, ఆ మాటకి అర్థం మారితే నా కంటే సంతోషించేవాళ్ళెవరుంటారు. కానీచూద్దాం, కాలం ఏంనిర్ణయిస్తుందో. మా తరంలో మేం చెయ్యలేనిది మీరు చేసి చూపిస్తే మాకు మాత్రం సంతోషంగాదూ...."మరీ మారని కాలంలో ఓ తండ్రిగా ఆయన ఇంకేం అనలేదు కూతురి నిశ్చయం, నిర్ణయం అర్థం అయి.

[ ఇండియా టు డే ]

★

# మళ్ళీ పెళ్ళి

సుగుణ, భాస్కరరావులు ఆ రోజు రిజిస్ట్రారు ఆఫీసులో పెళ్ళి చేసుకున్నారు! తరువాత ఓ దేవాలయంలో సుగుణ మెడలో మంగళ సూత్రం కూడా కట్టాడు భాస్కరరావు లాంఛనంగా.

రోజూ ఎన్ని వేలమందో పెళ్ళి చేసుకుంటున్నారు. అందులో సుగుణా భాస్కర్రావులు ఒకరు. ఇందులో ఏం వింత వుందని ఎవరన్నా అనుకోవచ్చు? పెళ్ళి చేసుకోడం వింత విషయం గాదు. ఎటొచ్చి వింతఅల్లా వితంతువుని, అందులో పిల్లాడి తల్లిని భాస్కరరావు పెళ్ళాడడం వింతేగా మరి! భాస్కరరావుకి రెండో పెళ్ళే! అయినా మగాడు. అందులో ముప్పైఏళ్ళవాడు రెండో పెళ్ళి చేసుకోడం అతి మామూలు విషయం!

అందుకే భాస్కరరావుని పొగడ్తలతో, శుభాకాంక్షలతో సహోద్యోగులు, మిత్రులు, అధికారులు ముంచెత్తారు. అతని సంస్కారాన్ని. ఆదర్శాన్ని పొగిడారు. అతని హృదయ వైశాల్యాన్ని కొనియాడారు. భాస్కర్రావు హృదయం గర్వంతో మరింత విశాలం అయింది. చాలా మంచి పని. ఘనకార్యం సాధించిన తృప్తితో అతని మనసు నిండిపోయింది.

ఇంక సుగుణ స్థితి!........ఆమెకి యిప్పటికీ యిదంతా నిజంకాదేమో భ్రమేమోననే అనుమానం! ఈ పెళ్ళి నమ్మశక్యం కాని విషయంలాగే అనిపిస్తూంది.